క్లుప్తంగా

వేంకన్న ఆదాయం రూ.2.73 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఫాజుల్‌బాగ్‌పేట నారాయణ తిరుమల కొండపై వేంచేసిన వేంకటేశ్వరస్వామి దేవాలయం హుండీల ఆదాయం రూ.2,73,075లు వచ్చిందని ఆలయ ఈవో శ్యామలరావు తెలిపారు. బుధవారం ఉదయం ఆలయ హుండీలను దేవదాయశాఖ తరపున ఈవో జి.గురునాథరావు, అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు, పెద్దల సమక్షంలో తెరిచినట్లు తెలిపారు. 71 రోజులకు ఈ ఆదాయం సమకూరినట్లు చెప్పారు. కార్యక్రమంలో వేంకటరామానుజ సేవాదళం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జూన్ 7న కర్మఫలం నాటిక ప్రదర్శన

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం రంగస్థల కళాకారుల నెలవారీ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో జూన్ 7వ తేదీన విశాఖకు చెందిన జాస్మిన్ ఆర్ట్స్ అండ్ కల్చరల్ ఈవెంట్స్ వారిచే 'కర్మఫలం' నాటిక ప్రదర్శన జరుగుతుందని నిర్వాహకులు పన్నాల నరిసింహమూర్తి, ఎల్.రామలింగస్వామి, బి.రామచంద్రదేవ్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 308వ నెల కార్యక్రమంలో భాగంగా ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాటకాభిమానులు పాల్గొనాలని కోరారు.

పరామర్శ



మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని ఇబ్రహింబాద్ గ్రామానికి చెందిన మాజీ జెడ్పీవిప్, జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు తమ్ముడు గోవిందరావు ఇటీవల మృతి చెందారు. దీంతో వారి కుటుంబాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కళింగ సామాజిక వర్గం అధ్యక్షుడు, కళింగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దుంపల రామారావు, ఆమదాలవలస జెడ్పీటీసీ బెండి గోవిందరావు, నాయకులు పప్పల రమేష్, కిల్లి ప్రకాష్, గురుగుబెల్లి గిరి తదితరులు బుధవారం పరామర్శించి సంతాపం తెలిపారు.

దళితులకు రక్షణ కరువు



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలోని దళితులకు రక్షణ కరువయ్యిందని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు పొన్నాడ రుషి బుధవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. తెనాలి పట్టణంలో ముగ్గురు దళిత, మైనారిటీ యువకులను నడిరోడ్డుపై పోలీసులు కొట్టిన ఘటన దారుణమన్నారు. రాజ్యాంగం ప్రకారం ప్రతి ఒక్కరికీ హక్కులు ఉంటాయనే విషయాన్ని గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. నిజంగా ఆ వ్యక్తులు తప్పుచేస్తే వాళ్లపై చట్టపరంగా తీసుకోవాల్సిన చర్యలు ఇవేనా అని ప్రశ్నించారు.


బొమ్మల కొలువు



టాయ్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసిన దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బొమ్మల కొలువు బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బుర్రి కుమార్‌రాజా మాట్లాడుతూ.. పిల్లల్లో సృజనాత్మకత పెంపొందించుకోవడానికి గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ డిప్యూటీ లైబ్రేరియన్ వీవీజీఎస్ శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ పీవీ భాస్కర్‌రాజా, ఉపాధ్యాయులు ప్రభాకర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి



ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీ రమణ

రణస్థలం/ఎచ్చెర్ల క్యాంపస్/శ్రీకాకుళం న్యూకాలనీ/శ్రీకాకుళం క్రైమ్: జిల్లాలోని అన్ని మండలాల్లో దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పలుచోట్ల సేవా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అధికారులు, అభిమానులు పాల్గొన్నారు.

అయ్యో అన్నదాత..!

- కూటమి ప్రభుత్వంలో అతలాకుతలం
- పెట్టుబడి సాయంలేక అప్పులు
- గ్రామాల్లో సేవలందక తిప్పలు



రైతులకు విత్తనాలు అందజేస్తున్న దృశ్యం (ఫైల్)



చిలకపాలేం రైతు భరోసా కేంద్రం

ఎచ్చెర్ల క్యాంపస్: వ్యవసాయాన్ని పండగ చేయాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా రైతు నివసిస్తున్న ఊరులోనే సేవలన్నీ అందేలా రైతు భరోసా కేంద్రాలను తీసుకొచ్చారు. ఫలితంగా రైతుకు ఎటువంటి అవసరం ఉన్నా ఆర్‌బీకేలో క్షణాల్లో పని జరిగేది. అలాగే వలంటీర్లు రైతు వద్దకే వెళ్లి వివరాలు నమోదు చేసేవారు. రైతుకు ఎటువంటి పథకం అందాలన్నా ఇంటి వద్ద నుంచే అన్ని పనులు జరిగేవి. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో రైతులకు అవస్థలు తప్పడం లేదు. గ్రామంలో ఎటువంటి సేవలు అందకపోవడంతో మండల కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.



రైతు భరోసా కేంద్రాలు నిర్వీర్యం

రైతులకు ఎన్నో సేవలందించిన రైతు భరోసా కేంద్రాలను కూటమి ప్రభుత్వం వచ్చాక నిర్వీర్యం చేయడం ప్రారంభించింది. ముందుగా ఆర్‌బీకేలను రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చినా.. అక్కడ రైతుకు ఎటువంటి సేవలందడం లేదు. ఇదివరకు ఆర్‌బీకేల్లో నిరంతరం వ్యవసాయ సహాయకులు సూచనలు, సలహాలు అందజేసేవారు. పొలంబడులు నిర్వహించి రైతులకు పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించేవారు. ప్రస్తుతం పొలంబడులు సక్రమంగా నిర్వహించడం లేదు. ఇదివరకు వ్యవసాయ, ఉద్యానవన సహాయకులు గ్రామం యూనిట్‌గా ఈ – క్రాఫ్ బుకింగ్ చేసేవారు. పండే పంటలు, విస్తీర్ణం, రైతుల వివరాలు ముందుగానే సేకరించేవారు. ఈ–క్రాఫ్ బుకింగ్ ఆధారంగా మద్దతు ధరకు పంటలు కొనుగోలు చేసేవారు. పంటల కొనుగోలు అనంతరం రైతుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేసేవారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ–క్రాఫ్ బుకింగ్ అనేది సక్రమంగా జరిగిన దాఖలాలే కనిపించలేదు.

రైతుకు సేవలు శూన్యం

ఇదివరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా ముందుగా వారికి కావల్సిన ఎరువులు, విత్తనాల సమాచారం సేకరించేవారు. అనంతరం వారికి ఎరువులు, విత్తనాలను ప్రభుత్వం నిర్దేశించిన ధరకు రాయితీపై ఇళ్లకు వలంటీర్ వ్యవస్థ ద్వారా అందజేసేవారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ రైతులకు అందేవి. ఎటువంటి దళారులు, మధ్యవర్తుల వ్యవస్థ లేకుండా రైతుకు నేరుగా ప్రభుత్వ సేవలు అందేవి. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో రైతుకు ఎరువులు దొరకని పరిస్థితి నెలకొంది. బ్లాక్‌లో పట్టణ ప్రాంతాలకు వెళ్లి కొనుగోలు చేయాల్సిన దుస్థితి పట్టింది. విత్తనాలు సక్రమంగా లభ్యమవ్వక ప్రైవేటు వ్యక్తుల నుంచి కొనుగోలు చేశారు.

నియోజకవర్గం	ఎచ్చెర్ల
మండలాలు	ఎచ్చెర్ల, లావేరు, జి.సిగడాం, రణస్థలం
రైతు సేవా కేంద్రాలు	99

రైతుకు భరోసా ఏదీ

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఏటా రైతులకు రైతుభరోసా పథకం ద్వారా కేంద్రంతో కలిసి మొత్తం రూ.18,500 అందజేసేవారు. దీనివలన రైతుకు పంటకు పెట్టుబడి సాయం అందేది. ఫలితంగా బయట అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉండేది కాదు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ ఊసెత్తడం మానేశారు. ఇప్పటికే ఒక ఏడాది ఇవ్వకపోవడంతో రైతులు అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

పేరు మార్చి సేవలు వదిలేశారు



కూటమి ప్రభుత్వం వచ్చాక రైతు భరోసా కేంద్రాలు నిర్వీర్యమయ్యాయి. పేరు మార్చుచేసి రైతుకు అందాల్సిన సేవలు పక్కన పెట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు విత్తనాలు అందజేయడం, మద్దతు ధరకు పంట కొనుగోలు, ఎరువులు అందజేయడం వంటి అనేక సేవలు అందేవి. ప్రస్తుతం ఇటువంటి సేవలు అందక అన్నదాత అవస్థలు పడుతున్నాడు.

– సనపల సూరిబాబు, సనపలవానిపేట

కుదించే ప్రయత్నం



ప్రస్తుతం రైతుసేవా కేంద్రాల్లో సక్రమంగా ఎటువంటి సేవలు అందడం లేదు. రైతులకు ఎంతో ప్రయోజనం చేకూర్చిన కేంద్రాలు కుదించే ప్రయత్నం జరుగుతోంది. అప్పట్లో ఇంటి వద్దకే అన్ని సేవలు అందజేసేవారు. అన్నదాతకు మేలు జరిగే వ్యవస్థను నిర్వీర్యం చేయడం మంచిది కాదు.

– బెందు రామారావు, ముద్దాడ

ఆశయం గాడి తప్పింది



వ్యవసాయాన్ని పండగ చేయాలనే లక్ష్యంతో గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. దీనిద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు వంటివి రాయతీపై అందజేసేవారు. అలాగే కావాల్సిన సేవలన్నీ ఊరులో అందాయి. కానీ ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆశయం గాడి తప్పింది.

– కొత్తకోట సూర్యారావు, కేశవరావుపేట

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



విజేతను అభినందిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని లయన్స్ ఇంటర్నేషనల్ జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్ అన్నారు. స్థానిక రెడ్‌క్రాస్ నైపుణ్యాభివృద్ధి భవనంలో చదరంగం పోటీలను లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ మెంటార్ నటుకుల మోహన్, జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్, కార్యదర్శి డా.పైడి సింధూర, లయన్ బరాటం లక్ష్మణరావు, పూర్వపు సిండికేట్ సభ్యులు బుధవారం ప్రారంభించారు. స్కూల్ ఆఫ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో చిల్డ్రన్స్ చెస్ చాంపియన్ టోర్నమెంట్ ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోటీల్లో శ్రీకాకుళం నగరంలోని విద్యార్థులతో పాటు, విశాఖపట్నం నుంచి కూడా సుమారు వంద మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. చదరంగం క్రీడతో మానసిక ఆనందం కలుగుతుందని, లాజికల్ థింకింగ్ పెరుగుతుందన్నారు. అనంతరం చెస్ విజేతలకు రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు చేతులమీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ చెస్ అకాడమీ కోచ్ భేరి చిన్నారావు, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ నూతన కార్యదర్శి టెక్కం రామ్‌గోపాల్, నూతన ఉపాధ్యక్షుడు శివతేజ, సీనియర్ సభ్యులు శిల్లా మణి, మానవత సభ్యుడు డాక్టర్ చింతాడ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

'మద్దతు ధర పెంచామనడం సమంజసం కాదు'



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కేంద్ర క్యాబినెట్ సమావేశంలో పంటలకు మద్దతు ధరలు ప్రకటిస్తూ వరి ధాన్యానికి క్వింటాకు రూ.69లు పెంచి, భారీగా పెంచామనడం సమంజసం కాదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కార్యదర్శి బుడితి అప్పలనాయుడు బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. 2025–26 ఖరీఫ్ సీజన్‌కు గాను రూ.2,369లు కేంద్రమంత్రి వర్గం ధరను నిర్ణయించిందన్నారు. ఇది పెరిగిన ఖర్చులకు ఏమాత్రం సరిపోదని పేర్కొన్నారు. 2010–11 సంవత్సరం నుంచి వ్యవసాయ ఉత్పత్తులకు పెద్ద ఎత్తున ధరలు పెంచడం ద్వారా ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల రైతుకి ఎంతోమేలు జరుగుతున్నట్లుగా చేసిన ప్రకటన మోసపూరితమైందని దుయ్యబట్టారు. నిజంగా అదే జరిగితే 1.20 లక్షల మంది రైతులు ఈ మధ్యకాలంలో ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారో చెప్పాలన్నారు. రోజుకి 39 మంది రైతులు చనిపోతున్నా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. తక్షణమే కేంద్ర క్యాబినెట్ తాము తీసుకున్న నిర్ణయాన్ని పునః పరిశీలన చేసి ధరలు పెరుగుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు ఆలయ భూముల కౌలుకు వేలం

శ్రీకాకుళం కల్చరల్: నగర పరిధిలోని పాలకొండ రోడ్డులో ఉన్న అద్దమణుగుల వెంకన్న పంతులు సత్రం హక్కు భుక్తంలో ఉన్న భూములను కౌలుకు ఇచ్చేందుకు ఈ నెల 29న వేలం నిర్వహిస్తున్నట్లు ఈఓ సర్వేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నరసన్నపేట మండలం కామేశ్వరిపేటలో పల్లం భూమి ఫలసాయం మూడేళ్ల పాటు పొందేందుకు ఈ వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కామేశ్వరిపేట గ్రామ సచివాలయం వద్ద జరిగే ఈ వేలానికి రూ.500 డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని కోరారు.

ఆదర్శ వ్యవస్థపై అక్కసు..!

- సచివాలయాలపై కూటమి శీతకన్ను
- ప్రజలకు అందని సేవలు



రాగోలు సచివాలయం

శ్రీకాకుళం రూరల్: ప్రజలందరికీ ఇంటి ముంగిటకే ప్రభుత్వ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. అప్పట్లో ఈ వ్యవస్థ ద్వారా అందించిన సేవలతో దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఒక సచివాలయంలో 12 రకాల సిబ్బంది వివిధ రకాల ఉద్యోగ విధుల్లో నియమితులయ్యేవారు. అందులో భాగంగా 35 డిపార్టుమెంట్లకు సంబంధించిన పౌర సేవలందేవి. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక సచివాలయం వంటి ఆదర్శ వ్యవస్థపై శీతకన్ను వేసింది. ప్రస్తుతం అక్కడ సక్రమంగా సేవలందకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. అలాగే వలంటీర్లు లేకపోవడంతో ప్రజలకు ఇంటి వద్దకే సేవలందడం లేదు. గతంలో మొత్తం 139 రకాల సేవలు అందగ, ప్రభుత్వం వాటిలో 75 శాతం సేవలు ప్రజలకు దూరమయ్యాయి.



నామమాత్రపు సేవలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామ, వార్డు సచివాలయాల్లో నామమాత్రంగా సేవలందుతున్నాయి. ప్రస్తుతం సచివాలయ వ్యవస్థను మెర్జ్ చేసే ఆలోచన కనిపిస్తోంది తప్ప, ప్రజలకు అవసరమ్యే సేవలు అందించడం లేదు. ఉద్యోగులను ఇతర పనులకు వినియోగిస్తుండడంతో ప్రస్తుతం సచివాలయంలో నామమాత్రంగానే ఉద్యోగులు ఉంటున్నారు. దీంతో పనుల నిమిత్తం సచివాలయాలకు వెళ్తున్న ప్రజలకు తిప్పలు తప్పడం లేదు.



రాగోలు సచివాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

సేవలందడం లేదు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని రకాల సేవలందేవి. ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో ఎటువంటి సేవలు అందడం లేదు. కనీసం రేషన్ కార్డుకు వెళ్లి దరఖాస్తు చేసుకుందామంటే ఇంటర్ నెట్ పనిచేయడం లేదని వెనక్కి పంపేస్తున్నారు.

– కె.కృష్ణవేణి, బావాజీపేట, రాగోలు సచివాలయం

అందుబాటులో ఉండడం లేదు



గత ప్రభుత్వ హయాంలో ఏదైనా పనిమీద సచివాలయానికి వెళ్తే వెంటనే సచివాలయ సిబ్బంది దగ్గరుండి పనులు చేసేవారు. ప్రస్తుతం సిబ్బంది అందుబాటులో ఉండడం లేదు. అత్యవసర పనులు మీద సచివాలయాలకు వెళ్తున్నా రోజుల తరబడి తిరగాల్సిన పరిస్థితి ఉంది.

– ఆర్.రేణుకమ్మ, రాయిపాడు గ్రామం

దారుణ'దారులు'



చెరువును తలపిస్తున్న ధర్మవరం రోడ్డు



వెంకటాపురం రోడ్డు

ఎచ్చెర్ల మండలంలోని రహదారులు గంతలతో అధ్వానంగా మారాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలతో నీరు గుంతల్లో నిల్వ అవుతుండడంతో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. వెంకటాపురం, దుప్పలవలస, తోటపాలేం, కొత్తపేట, ధర్మవరం, డి.మత్స్యలేశం, బడివానిపేట, జరజాం, దోమాం తదితర గ్రామాలకు వెళ్లే రహదారులు పూర్తిగా పాడయ్యాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా రోడ్ల మరమ్మతులపై దృష్టి పెట్టలేదు. అందువలన ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారుల మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్



కొత్తపేట రోడ్డు



దోమాంకు వెళ్లే రోడ్డు



దుప్పలవలస రోడ్డు

మెరిట్ జాబితా విడుదల

శ్రీకాకుళం న్యూకాలనీ: పట్టణంలోని హయాతీనగరంలో ఉన్న మహాత్మా జ్యోతిరావుపూలే వెనుకబడిన తరగతుల రెసిడెన్షియల్ బాలికల గురుకుల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికిగాను 5వ తరగతిలో ప్రవేశాలకు నిర్వహించిన ప్రవేశ పరీక్షలో మెరిట్ సాధించిన విద్యార్థినుల జాబితాను ప్రిన్సిపాల్ జి.స్వరాజ్యలక్ష్మి బుధవారం విడుదల చేశారు. మెరిట్ జాబితాను పాఠశాల ప్రాంగణంలోని నోటీసు బోర్డులో అతికించడంతో పాటు సీట్లు పొందినవారికి ఫోన్ ద్వారా సమాచారం అందించడం జరిగిందన్నారు. సీట్లు వచ్చినవారు జూన్ 3వ తేదీలోగా అడ్మిషన్ పొందాలని, తగిన ధ్రువపత్రాలు, జిరాక్స్ కాపీలు, పాస్‌ఫొటోలతో హాజరు కావాలని సూచించారు.

రోడ్డుపైనే మురుగుకూపం



మురుగుకూపం పక్కనుంచి వెళ్తున్న పాదచారులు



రోడ్డుమీదే మురుగు చెత్త ఉండడంతో ప్రజల అవస్థలు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని ఇలిసిపురం జంక్షన్ ఇరుకుగా మారడంతో స్థానికులు, ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం వాహనాలు, పాదచారుల తాకిడితో రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో అధికార యంత్రాంగం మొద్దు నిద్రతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. మరోవైపు రోడ్డుకు ఆనుకుని ఉన్న డ్రైనేజీలో మురుగు కూపాన్ని ఐదురోజుల క్రితం తీసి రోడ్డుపైనే పురపాలకశాఖ వాళ్లు వేయించారు. కానీ అది డంపింగ్ యార్డుకు తరలించడం మరిచారు. దీంతో వాహనదారులు ట్రాఫిక్‌లో ఇరుక్కుంటే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. తీవ్ర దుర్గంధాన్ని భరించి విధులు నిర్వర్తించాల్సిన ట్రాఫిక్ సిబ్బంది సైతం చెప్పుకోలేక తప్పనిసరిగా నెట్టుకొస్తున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి చెత్తను రోడ్డుపై నుంచి తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

రుతుక్రమంపై అవగాహన



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: నగరంలో కృష్ణాపార్క్ సెక్టార్ పరిధిలోని చేపల వీధి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం రుతుక్రమంపై ఐసీడీఎస్ శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్ట్ అధికారి జి.శోభారాణి కిశోరి బాలికలకు అవగాహన కలిగించారు. జాతీయ రుతుక్రమం దినోత్సవం పురస్కరించుకొని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ రుతుక్రమంలో పరిశుభ్రత పాటించి మంచి ఆహారాన్ని తీసుకోవాలన్నారు. రుతుక్రమ సమయంలో నాప్‌కిన్స్ మాత్రమే వాడాలని పర్యవేక్షకురాలు పి.సీతామహాలక్ష్మి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌కే రత్నకుమారి, ఆశావర్కర్ పల్లవి, అంగన్‌వాడీ కార్యకర్తలు లత, నాగమణి పాల్గొన్నారు.

జూన్ 8న శిష్టరత్న అవార్డులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లా శిష్టకరణ సేవా సంఘం ఆధ్వర్యంలో 2023–2024 విద్యా సంవత్సరానికి గానూ శిష్టరత్న పేరిట అవార్డులు ప్రధాన కార్యక్రమం జూన్ 8వ తేదీన నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డబ్బీరు శ్రీనివాసరావు, సదాశివుని కృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు సంఘం ప్రతినిధులును సంప్రదించాలని సూచించారు.

ఘనంగా రాఘవేంద్ర మఠం వార్షికోత్సవం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న రాఘవేంద్ర స్వామి మఠం 21వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ప్రధాన అర్చకులు ముద్గల సూర్య ప్రకాష్ ఆధ్వర్యంలో ఆరాధన మహోత్సవం సందర్భంగా పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో మధ్వ సిద్ధాంత వేద విజ్ఞాన మండలి ప్రతినిధులు జమ్మి వేంకటేశ్వరరావు, కడప సురేష్, చట్టి వెంకటరమణరావు తదితరులు పాల్గొన్నారు.

జూన్ 19న జిల్లాకు షర్మిల రాక



మాట్లాడుతున్న అంబటి కృష్ణారావు

శ్రీకాకుళం అర్బన్: రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి జూన్ 19వ తేదీన శ్రీకాకుళం జిల్లాలో పర్యటించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు, జిల్లా ఇన్‌చార్జి గాదం వెంకట త్రినాథరావులు తెలిపారు. శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన భవన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జూన్ 19న మధ్యాహ్నం మూడు గంటలకు ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంలో భాగంగా పర్యటన చేస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో నియోజకవర్గ కో–ఆర్డినేటర్లు ఆబోతుల వెంకట నాయుడు, బొచ్చ వెంకటరమణ, మామిడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.